తాత్కాలిక కమిషనర్‌గా వై.ఓ.నందన్

ప్రజాశక్తి -కడప అర్బన్

నగరపాలక సంస్థ నూతన తాత్కాలిక కమిషనర్‌గా వై.ఒ.నందన్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ, సిఎండి ఆదేశాల మేరకు అదనపు కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించాలని చెప్పారు. అభివృద్ధి, సంక్షేమం, శానిటేషన్, ప్రజా ఆరోగ్యంపై దృష్టి సారిస్తామని పేర్కొన్నారు. మేయర్ సురేష్ బాబు, పాలకమండలి సహకారంతో అభివృద్ధి పనులను వేగవంతం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో నగరపాలక అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి - కడప అర్బన్

ఎస్‌టిఎఫ్ఐ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మి రాజా డిమాండ్ చేశారు. ఎస్‌టిఎఫ్ఐ ఆవిర్భవించి 25 సంవత్సరాలు పూర్తయి రజతోత్సవాలు జరుపుకుంటున్న సందర్భంలో కడప యుటిఎఫ్ భవన్ ఎదుట ఎస్‌టిఎఫ్ఐ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఏకపక్ష ధోరణితో నిరంకుశ విధానాలను అమలు పరుస్తుందని తెలిపారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు వృద్ధాప్యంలో భరోసా లేని నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేయడంలో పూర్తిగా వైఫల్యం చెందిందని పేర్కొన్నారు నూతన విద్యా విధానం, సిపిఎస్ రద్దుకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉండాలని, లేని పక్షంలో భవిష్యత్తులో ఉద్యమ కార్యాచరణ ద్వారా ప్రభుత్వం మెడలు వంచైనా వాటిని పరిష్కరించుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు, ట్రెజరర్ నరసింహారావు, సహాధ్యక్షురాలు సుజాతారాణి, రాష్ట్రం కౌన్సిల్ సభ్యులు రూతు ఆరోగ్య మేరీ, నాయకులు శంకర్ రెడ్డి, కరిముల్లా పాల్గొన్నారు.

శ్రీనివాసరెడ్డికి కృతజ్ఞతలు

ప్రజాశక్తి - కడప అర్బన్

అఫ్సర్‌ఖాన్

నగరంలోని వక్ఫ్ బోర్డు అధ్వర్యంలో ఉన్న జులేఖా బి మసీదు అస్తులు అన్యాక్రాంతం అవుతున్న సమయంలో టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాస రెడ్డి ప్రహరీ నిర్మాణానికి అనుమతులు ఇప్పించడం చాలా సంతోషించ దగ్గవిషయమని టిడిపి మైనార్టీ నాయకులు అఫ్సర్ ఖాన్ పేర్కొన్నారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ 10 సంవత్సరాలుగా ఎమ్మెల్యేగా, 5 ఏళ్లుగా మైనారిటీ శాఖ మంత్రిగా వున్న అంజాద్ బాషా పట్టించుకున్న దాఖలాలు లేవని తెలిపారు. 25 ఏళ్లుగా నలుగుతున్న సమస్య మసీదు కమిటీ వారితో కలిసి శ్రీనివాస దృష్టికి తీసుకువెళ్లామని చెప్పారు. తప్పకుండా న్యాయం చేస్తానని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. ఆ ప్రకారంగానే ఆయన ప్రత్యేక శ్రద్ధ కనబరచి వక్ఫ్ భూమి హద్దులకు గోడ నిర్మించుకునేందుకు అనుమతి ఇప్పించారని తెలిపారు. శ్రీనివాస రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

కృత్రిమ గర్భధారణ టీకాలు వేయించాలి

ప్రజాశక్తి-కలసపాడు

మండలంలోని తొలిచూలు పశువులకు కృత్రిమ గర్భధారణ టీకాలు వేయించాలని, పశువులు ఆరోగ్యంగా ఉండాలంటే మినీ గోకులాల అవసరమని పశువైద్యాధికారి ఏ .వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం మండలంలోని పశువులు యజమానులతో అయన మాట్లాడుతూ మొదట పాడిపశువులకు సీజనల్ వ్యాధులు రాకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. కృత్రిమ గర్భధారణ వల్ల పశువులు ఎక్కువ మోతాదులో మేత మేయడమే కాకుండా, మంచి పాల దిగుబడిని ఇస్తుందని అన్నారు. ఈ వర్ష కాలంలో పశువులు ప్రశాంతంగా ఉండేందుకు మినీ గోకులాలను రైతులు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. అందుకు ప్రభుత్వం కొంతవరకు సాయం చేస్తుందని ఆయన అన్నారు. ప్రతి ఒక రైతూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. మినీ గోకులాలు అవసరమైన వారు వైద్యాధికారిని సంప్రదించవలసిందిగా తెలిపారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

ఇ-క్రాప్ నమోదు తప్పనిసరి

ప్రజాశక్తి-కలసపాడు

మండలంలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగు చేసిన రైతులు ఇ-క్రాప్ చేయించుకుంటే ప్రభుత్వ పథకాలకు అర్హులవుతారని ఎఓ జాకీర్ షరీఫ్ పేర్కొన్నారు. మంగళశారం రాజుపాలెం గ్రామంలో ఇ పంట నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు రైతు సేవ కేంద్రాలలోకి వెళ్లి వ్యవసాయ సహాయ అధికారితో కలిసి ఇ క్రాప్ చేయించుకోవాలన్నారు. తద్వారా ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీలు, సంక్షేమ పథకాలు రైతులకు అందుతాయని తెలిపారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో సాగుచేసిన పంటలకు ఉచిత పంటల బీమా గత సంవత్సరం మార్గదర్శకాలు వర్తిస్తాయి అన్నారు. కార్యక్రమంలో ఎఇఒలు పాల్గొన్నారు.

భజన పరులతో జాగ్రత్త

ప్రజాశక్తి- కడప అర్బన్

తెలుగుదేశం పార్టీలో భజన పరులతో జాగ్రత్తగా ఉండాలని, లేకపోతే పార్టీ మనుగడకే ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని ఆ పార్టీ కడప నగర ఉపాధ్యక్షులు కొండ సుబ్బయ్య, శివశంకర్ రెడ్డి అన్నారు. మంగళవారం వారు మీడియాతో మాట్లాడుతూ గతంలో తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు రోజా, విడుదల రజిని చంద్రబాబును ఏవిదంగా భజన చేశారో చెప్పాల్సిన పనిలేదన్నారు. ఆ తరువాత వైసిపిలో చేరి ఆంత కంటే ఎక్కువ స్థాయిలో రోజా, రజిని మరి కొంతమంది జగన్ రెడ్డికి భజన చేశారని పేర్కొన్నారు. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీలో చేరి, ఆ పార్టీ నాయకుల భజన చేసే వారి విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలని కోరారు. మన కడప నియోజకవర్గంలో కూడా చాలామంది వైసిపి నుంచి వచ్చి టిడిపి అంటే తామే అని వ్యవహరిస్తూ పార్టీ కష్టకాలంలో జెండా పట్టుకున్న కార్యకర్తలను అణగదొక్కే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. తెలుగుదేశం పార్టీ అటువంటి వారితో జాగ్రత్తగా ఉండాలని, లేకపోతే పార్టీ మనుగడకే ప్రమాదమని అభిప్రాయపడ్డారు.

రెవెన్యూ సదస్సులపై అవగాహన

ప్రజాశక్తి చింతకొమ్మదిన్నె : మండలంలో మంగళవారం రెవెన్యూ గ్రామ సదస్సులపై విఆర్ ఒలకు మంగళవాకం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ నాగేశ్వరావు మాట్లాడుతూ గ్రామ సభలో రైతు పొలాల వివరాలను సరిచూసి భూ సమస్యలు, వెబ్‌లాండ్‌లోని తప్పులు సరిచేసి సవరణలు చేయాలన్నారు. రికార్డులు క్షుణ్ణంగా పరిశీలించి భూ బాధితులకు న్యాయం చేయాలన్నారు.

నందిపల్లెలో న్యాయ విజ్ఞాన సదస్సు

ప్రజాశక్తి- గోపవరం : మండల లీగల్ సర్వీసెస్ కమిటీ కోర్టు బద్వేలు ఆధ్వర్యంలో నందిపల్లెలో మంగళవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి వై.జె. పద్మ, జూనియర్ సివిల్ జడ్జి బి.గాయత్రి మాట్లాడుతూ గ్రామంలో సమస్యలు లేకుండా ఏవైనా కేసులు ఉంటే సత్వర పరిష్కారం చేసుకొని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుకోవాలని పేర్కొన్నారు. సదస్సులో డివిఎస్ ఆర్ కృష్ణ, ప్రభుత్వ న్యాయవాది వి. సత్యనారాయణరెడ్డి, శ్రీనివాసులు న్యాయవాదులు పాల్గొన్నారు,

కెఎల్ఎం విద్యార్థులకు బహుమతులు

ప్రజాశక్తి - కడప అర్బన్



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న అధ్యాపకులు

ప్రపంచ ఎడమ చేతి వాటం దినోత్సవం సందర్భంగా కెఎల్ఎం మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం ఎడమ చేతి వాటం విద్యార్థినులకు పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులను అందజేశారు. ఎడమ చేతి వాటం ఉన్నవారు ఎదుర్కొనే కొన్ని సమస్యలను వారు పంచుకున్నారు. కళాశాల ఎమ్‌డి డాక్టర్ చంద్ర ఓబుల్ రెడ్డి విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో అన్ని శాఖల విభాగాధిపతులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

గంజాయి నివారణపై ప్రత్యేక దృష్టి

రాత్రి సమయాల్లో గస్తీ ముమ్మరం
నేరాల అడ్డుకట్టకు ప్రత్యేక బలగాలు
ఎస్‌పి హర్షవర్ధన్‌రాజు

మీడియాతో మాట్లాడుతున్న ఎస్‌పి హర్షవర్ధన్‌రాజు

ప్రజాశక్తి-పులివెందుల రూరల్

గంజాయి నివారణపై ప్రత్యేక దృష్టి సారించామని, ఇందు కోసం ప్రత్యేక టీములను ఏర్పాటు చేయడం చేశామని, అసాంఘిక కార్యక్రమాలు పాల్పడే వారిపై ప్రత్యేక నిఘా ఉంచామని ఎస్‌పి హర్షవర్ధన్‌రాజు అన్నారు. మంగళవారం పులివెందుల అర్బన్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్ పరిసరాలు, సిబ్బంది వివరాలు, రికార్డుల నిర్వహణ,స్టేషన్ కేసుల స్థితిగతులు ,పోలీస్ స్టేషన్ పరిధిలో నేరాలు జరిగే ప్రాంతాలు, శాంతిభద్రతలు, సంఘ వ్యతిరేక కార్యకలాపాల గురించి అడిగి తెలుసుకున్నారు రౌడీ షీటర్ల కదలికలు, కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని, పోలీస్ స్టేషన్ పరిధిలో రాత్రిళ్ళు గస్తీని ముమ్మరం చేయాలని డిఎస్‌పి బుక్కె మురళి నాయక్‌కు సూచించారు అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మట్కా, గంజాయి, పేకాట తదితర సాంఘిక కార్యక్రమాలు పాల్పడే వారిపై ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు. పులివెందుల పట్టణంలో సిసి కెమెరాల ఏర్పాటుకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని త్వరలోనే ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే దొంగతనాలు జరగకుండా గస్తీ ముమ్మరం చేశామని చెప్పారు. ముఖ్యంగా బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. క్రికెట్ బెట్టింగ్, పేకాట, మట్కా నిర్వహించే వ్యక్తులపై గట్టి నిఘా ఉంచి ప్రతినెల వారికి కౌన్సెలింగ్ కూడా ఇస్తామన్నారు. ప్రజలకు పోలీసులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని, ఏదైనా సమస్య వస్తే నిర్భయంగా తమకు సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో రూరల్ సిఐ బాల మద్దిలేటి, ఎస్ఐ అనిల్ కుమార్ పోలీసులు పాల్గొన్నారు.

స్థానికులకే ఉద్యోగ అవకాశాలు కల్పించాలి

ప్రజాశక్తి - బద్వేలు

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు చిన్ని

రూ. వెయ్యి కోట్లతో గోపవరం మండలంలో స్థాపించిన సెంచరీ ప్లైవుడ్‌లో స్థానిక యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, అలాగే సెంచరీ ప్లైవుడ్‌లో ప్రస్తుతం ఉన్న స్థానిక ఉద్యోగులను తొలగించాలనే ఆలోచన విరమించుకోవాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని కోరారు. మంగళవారం స్థానిక సుందరయ్య భవనంలో డివైఎఫ్ఐ బద్వేల్ పట్టణ నాయకులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెంచరీ ప్లైవుడ్‌లో 75 శాతం స్థానిక యువతీ, యువకులకు ఉద్యోగ అవకాశాలు ఇవ్వాలన్నారు. ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులను, గత ప్రభుత్వంలో చేర్చుకున్న వారిని ఇప్పుడు విధులకు రావద్దని వారిపైన ఒత్తిడి తేవడం సరైన పద్ధతి కాదని పేర్కొన్నారు. స్థానికులకు ఉద్యోగ అవకాశాలు ఇవ్వకుండా ఇతర రాష్ట్రాల వారికి అవకాశం కల్పించడం సరైందని కాదన్నారు. స్థానికులు పొలాలు పోగొట్టుకొని సెంచరీ ప్లైవుడ్ కంపెనీకి ఇస్తే వారి పిల్లలకు ఉద్యోగ అవకాశాలు ఇవ్వకుండా బయట వ్యక్తులకు ఉద్యోగాలు ఇవ్వడం చాలా దారుణమన్నారు. పొలాలు కంపెనీకి ఇచ్చే సమయంలో ప్రతి ఒక్కరికీ ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని మాయమాటలు చెప్పి, తీరా కంపెనీలో ఉత్పత్తి ప్రారంభించాక, ఇతర రాష్ట్రాల వారికి ఉద్యోగ అవకాశాలు ఇవ్వడం ఏమిటని వారు ప్రశ్నించారు. స్థానిక యువతి యువకులకు సెంచరీ ప్లైవుడ్ కంపెనీలో 75 శాతం ప్రకారం ఉద్యోగ అవకాశాలు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో స్థానిక నిరుద్యోగ యువతి యువకులతో కలిసి డివైఎఫ్ఐ యువజన సంఘం పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలను చేపడతామని వారు హెచ్చరించారు. సమావేశంలో డివైఎఫ్ఐ బద్వేల్ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.కె.మస్తాన్ షరీఫ్, గంగనపల్లి నాగార్జున, పట్టణ ఉపాధ్యక్షులు ఎస్.కె ఆదిల్, తమ్మిశెట్టి సురేష్, సహాయ కార్యదర్శి ఎస్కె ఖలీల్, మాబు పీర్ ,శివ పాల్గొన్నారు.

ప్రాథమిక పాఠశాలను తెరిపించాలని నిరసన

నిరసన చేస్తున్న వడ్డెర వృత్తిదారుల సంఘం నాయకులు, స్థానికులు

ప్రజాశక్తి-అట్లూరు

మండలంలోని కమలకూరు బిసికాలనీలోని ప్రాథమిక పాఠశాలను పునఃప్రాంభించాలని వడ్డెర వృత్తిదారుల సంఘం మండల నాయకులు బి. గంగయ్య డిమాండ్ చేశారు. మంగళవారం పాఠశాల ముందు తల్లిదండ్రులతో సంఘం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా గంగయ్య మాట్లాడుతూ బిసి కాలనీలో సుమారు 70 శాతం వడ్డెర, 30 శాతం ఇతర సామాజిక పేద కుటుంబాలు నివాసముంటున్నాయన్నారు. ఇన్ని కుటుంబాలున్న కాలనీలో ప్రాథమిక పాఠశాలను మూతవేయడం దారుణమన్నారు. దీంతో విద్యార్థులు వేరే ప్రాంతాలకు వెళ్లి చదువుకునే దుస్థితి ఏర్పడిందని వాపోయారు. కొందరు విధిలేని పరిస్థితుల్లో ప్రయివేట్ పాఠశాలను ఆశ్రయిస్తున్నారని తెలిపారు. ఐదేళ్ల పాఠశాలను మూత వేశారని, దీని వల్ల ఒకటిన్నర కిలో మీటరు దూరంలో ఉన్న కమలకూరు మెయిన్ పాఠశాలకు వెళ్లి చదువుకుంటున్నారన్నారు. కాలనీలోని ప్రాథమిక పాఠశాలను తెరిపించాలని పలుమార్లు అధికారులకు వినతి పత్రం అందించిన పట్టించుకున్న పాపాన పోలేదని వాపోయారు. విద్యార్థుల కష్టాలను, అవస్థలను మండల విద్యాశాఖాధికారులు అర్థం చేసుకొని మూసివేసి ఉన్న ప్రాథమిక పాఠశాలను వెంటనే రీఓపెన్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వడ్డెర వృత్తిదారుల సంఘం మండల నాయకులు బి .వెంకటమ్మ , చంద్రగిరి లక్ష్మీదేవి ఓర్సు పార్వతి, వల్లెపు లక్ష్మీదేవి, చంద్రగిరి సుమతి పాల్గొన్నారు.

రసవత్తరంగా అండర్-19 క్రికెట్ పోటీలు

ప్రజాశక్తి - కడప

జి ఈశ్వర్ రిత్విక్ (182 పరుగులు), రేవంత్ నాగ కుమార్ (121)

ఈశ్వర్ రిత్విక్ 182 పరుగులు, ఎం. యువన్ 95 చేయడంతో విశాఖపట్నం జట్టు భారీ స్కోరు దిశగా పయనిస్తోంది. జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎసిఎ అండర్ - 19 బి అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా మంగళవారం ఆరవ రౌండ్ మ్యాచ్‌లు ప్రారంభమయ్యాయి. వై.ఎస్.రాజారెడ్డి ఎసిఎ స్టేడియంలో విశాఖపట్నం, కృష్ణా జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన విశాఖపట్నం జట్టు మొదటి రోజు ఆట ముగిసిన సమయానికి 89.5 ఓవర్లలో 4 వికెట్లు నష్టానికి 356 పరుగులు చేసింది. ఆ జట్టులోని జి ఈశ్వర్ రిత్విక్ 294 బంతులను ఎదుర్కొని 18 బౌండరీలు, 7 సిక్సర్ల సహాయంతో 182 పరుగులు (సెంచరీ) చేశాడు. ఎం. యువన్ 95 పరుగులు చేశాడు. కృష్ణా జట్టులోని ఆదర్శ రెండు వికెట్లు తీసుకున్నాడు.

కెఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో జరుగుతున్న మ్యాచ్‌లో చిత్తూరు, కడప జట్లు తలపడుతున్నాయి. టాస్ గెలిచి బ్యాటింగుకు దిగిన చిత్తూరు జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 91.0 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 293 పరుగులు చేసింది. ఆ జట్టులోని చరణ్జిత్ 66, లోహిత్ లక్ష్మీనారాయణ 53 పరుగులు చేశారు. కడప జట్టులోని నాగ కుళ్లాయప్ప 3, జి. హెచ్. కె. రెడ్డి 2 వికెట్లు తీసుకున్నారు.

కెఒఆర్ఎం క్రికెట్ మైదానంలో జరుగుతున్న మ్యాచ్‌లో 122 పరుగులకే నెల్లూరు జట్టు కుప్పకూలింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన నెల్లూరు జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 29.0 ఓవర్లలో 122 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని మన్విత్ రెడ్డి 59 పరుగులు చేశాడు. వెస్ట్ గోదావరి జట్టులోని డి. యశ్వంత్ 3, రేవంత్ నాగ కుమార్ 3 వికెట్లు తీసుకున్నారు. అనంతరం మొదటి ఇన్నింగ్స్ ప్రారంభించిన వెస్ట్ గోదావరి జట్టు మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 60.0 ఓవర్లలో 5 వికెట్లు నష్టానికి 268 పరుగులు చేసింది. ప్రాజెక్టులోని రేవంత్ నాగ కుమార్ బ్యాటింగ్‌లో అద్భుతంగా రాలిం చాడు. 121 పరుగులు(సెంచరీ)చేసి నాటౌట్ గా ఆడుతున్నారు. రక్షణ్ 76 పరుగులు చేశాడు. నెల్లూరు జట్టులోని టి. మోహన్ 2 వికెట్లు తీసుకున్నాడు.

స్వాతంత్ర్య సమరయోధుల చిత్ర ప్రదర్శన

చిత్రప్రదర్శనలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

ప్రజాశక్తి - కమలాపురం

మండలంలోని పెద్దచెప్పలి జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో 78వ భారత స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని సి.వి.రామన్ సైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం భారత జాతీయోద్యమ ఘట్టాలు, స్వాతంత్ర్య సమరయోధుల చిత్ర ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ పుత్తా పుల్లారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై స్వాతంత్ర్య భారతావనికై అహర్నిశలు కష్టపడి తమ ఆస్తులను, ప్రాణాలను ఫణంగా పెట్టిన ఎందరో పోరాట వీరులను ఈ ప్రదర్శన ద్వారా విద్యార్థులకు తెలియజేయడం అభినందనీయమని, వారందరి ఐక్యత పోరాట కృషిని మనం నిత్యం స్మరించుకోవాలని, స్ఫూర్తిని కొనసాగించాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. ప్రధానోపాధ్యాయులు ఏ.ఓబుల్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులందరూ స్వాతంత్ర్య సమరయోధుల ఐక్యత పోరాటాన్ని, భారతీయ మిశ్రమ సంస్కృతిని, భిన్నత్వంలో ఏకత్వాన్ని గుర్తు చేసుకుని బాగా కష్టపడి చదివి భారతదేశాన్ని ఆర్థిక సామాజిక సమానత్వ సాధన దిశగా కృషి చేసి ప్రపంచంలో మేటి దేశంగా గర్వపడేలా దేశాన్ని మరింత ముందుకు తీసుకుపోవాలని తెలిపారు. సి వి రామన్ సైన్స్ క్లబ్ కడప డివిజన్ అధ్యక్షులు, బయాలజీ ఉపాధ్యాయులు ఆర్. శ్రీనివాసుల రెడ్డి రూపొందించిన జాతీయ ఉద్యమ ఘట్టాలు, జాతీయ నాయకుల చరిత్రలను వారి ఫొటోలు, ఉమ్మడి కడప జిల్లాలో స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న నాయకులు కడప కోటిరెడ్డి, ఎద్దుల ఈశ్వర్ రెడ్డి, ఆలూరు పకీరప్ప మొదలగు 26 మంది మన ప్రాంత స్వాతంత్ర సమరయోధుల ప్రదర్శనలో ఉంచి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న కమిషనర్ నందన్

సచివాలయాల్లో ఆకస్మిక తనిఖీ

నగరపాలక సంస్థ కమిషనర్ వై.ఓ.నందన్ బాధ్యతలు స్వీకరించిన వెంటనే పోలీస్ పెరేడ్ గ్రౌండ్, పాత కలెక్టరేట్, 25 వార్డ్ రాధాకృష్ణ నగర్ సచివాలయం, 24వ వార్డ్ కో-ఆపరేటివ్ కాలనీ వన్ సచివాలయాలను ఇంజినీర్, ప్లానింగ్, పబ్లిక్ హెల్త్ విభాగ అధికారులు, సిబ్బందితో కలిసి పరిశీలించారు. పోలీస్ పెరేడ్ గ్రౌండ్ పరిశీలిస్తూ స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా నగరపాలక సంస్థ నుంచి చేయు పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఇంజినీరింగ్ విభాగం నుంచి చేయవలసిన పనులలో భాగంగా ప్రజలకు సిట్టింగ్ ఏర్పాటు,త్రాగునీటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తాత్కాలిక మరుగుదొడ్లను ఏర్పాటు చేయాలని ఇంజినీరింగ్ విభాగ అధికారులకు సూచించారు. పారిశుధ్య పనుల్లో ఎటువంటి జాప్యం ఉండరాదని పేర్కొన్నారు. ప్లానింగ్ విభాగ అధికారులతో శకటం తయారీ పనులను పాత కలెక్టరేట్‌లో పరిశీలించారు. అనంతరం రాధాకృష్ణ నగర్, కోపరేటివ్ కాలనీ వన్ సచివాలయాలను తనిఖీ చేశారు. అటెండెన్స్, మూమెంట్ రిజిస్టర్లను పరిశీలించారు.

ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న బ్యాంక్ అధికారులు

ఘనంగా విభజన సంస్మరణ దినోత్సవం

ప్రజాశక్తి - కడప

దేశ విభజనతో అల్లాడుతున్న లక్షలాదిమంది ప్రజల వేదన, బాధలను వెలుగులోకి తీసుకు వచ్చేందుకే 'విభజన భయానక స్మరణ దినోత్సవ' ఉద్దేశమని లీడ్ బ్యాంక్ మేనేజర్ జి. జనార్దనం, కెనరా బ్యాంకు రీజినల్ మేనేజర్ కె.మురళీమోహన్, రిటైర్డ్ ప్రొఫెసర్, సీనియర్ సిటిజన్ కె.మల్లయ్య అన్నారు. మంగళవారం లీడ్ జిల్లా మేనేజర్, లీడ్ జిల్లా ఆఫీసు ఆధ్వర్యంలో కడప నగరం మోచంపేటలోని రామకృష్ణ హైస్కూల్ కాంపౌండ్, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో 'విభజన భయానక స్మరణ దినోత్సవం' పై ఫొట ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు.

జాతీయ జెండాతో వైవీయూ విసి, రిజిస్ట్రార్, ప్రిన్సిపల్, విద్యార్థులు

వైవీయూలో ఫ్లాగ్ మార్చ్

ప్రజాశక్తి - కడప అర్బన్

భారతదేశ స్వాతంత్ర్య వేడుకల సందర్భంగా యోగి వేమన విశ్వవిద్యాలయంలో మంగళవారం మెగా ఈవెంట్ ర్యాలీ (ఫ్లాగ్ మార్చ్) నిర్వహించారు. ఫ్లాగ్ మార్చ్‌ను విశ్వ విద్యాలయ విసి ఆచార్య కె. కృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య ఎస్.రఘునాథరెడ్డితో కలసి ప్రారంభించారు. స్పోర్ట్స్ సైన్సు శాఖ సహ ఆచార్యులు డా. ఎ. రామసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో 350 అడుగుల పొడవైన మువన్నెల జాతీయ జెండాను విద్యార్థులు చేతపట్టుకుని ముందుకు కదిలారు. ప్రధాన పరిపాలన భవనం నుంచి మొదలై విశ్వవిద్యాలయ అంతర్గత రహదారుల ద్వారా కడప- పులివెందుల రోడ్డు మీదుగా మళ్లీ పరిపాలన భవనానికి చేరుకుంది. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ భారతదేశ పౌరుడిగా గర్విద్దాం, దేశం కీర్తించేలా ఎదిగి దేశ ఔన్నత్యాన్ని శిఖరస్థాయికి తీసుకువెళుదామని కోరారు. రిజిస్ట్రార్ ఆచార్య ఎస్.రఘునాథరెడ్డి మాట్లాడుతూ దేశానికి ప్రతీక అయిన మువ్వన్నెల జెండా మురిసేలా కార్యక్రమం నిర్వహించామన్నారు. ప్రతి ఒక్కరికీ ముందస్తు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ ఆచార్య పద్మ, సీనియర్ ప్రొఫెసర్లు, సహ, సహాయ ఆచార్యులు, అకడమిక్ కన్సల్టెంట్లు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

తేక్వాండో పోటీల్లో విద్యార్థుల సత్తా

ప్రజాశక్తి - కడప సిటీ :ఈనెల 11,12 తేదీల్లో తిరుపతిలో నిర్వహించిన ఫస్ట్ సౌత్ జోన్ జాతీయస్థాయి తేక్వాండో పోటీలలో వి తేక్వాండో క్లబ్ విద్యార్థులు సత్తా చాటారు. వీ తైక్వాండో క్లబ్ మాస్టర్ ఎస్.కె. వసీం, కోచ్ కె. నరసింహ శిక్షణలో పలువురు పతకాలు కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చదువులోనేగాక మార్షల్ ఆర్ట్స్‌లో ప్రోత్సహించిన తల్లిదండ్రులకు అభినందనలు తెలుపుతున్నామన్నారు. ముఖ్యంగా బాలికలను ఆత్మరక్షణ విద్యలో ప్రోత్సహించడం గర్వకారణమని తెలిపారు. జాతీయ స్థాయి పోటీలలో ఎస్.కె సుమయ్య, కె చంద్రకళ, ఎం సుహాన్విక రెడ్డి, ఎన్ చరణ్ కుమార్ రెడ్డి, ఎన్ ప్రణయ్ కుమార్ రెడ్డి , టి హర్షవర్ధన్ రెడ్డి , ఎస్ ఎం డి ఇర్ఫాన్ గోల్డ్ మెడల్ సాధించారని తెలిపారు. వీరితోపాటు భవ్య, జాహ్నవి, సాయి, ఎం సాయి చాణక్య రెడ్డి, కౌశిక్ నారాయణ, ఎస్ ఎం డి సోహెల్ , ఏ ఎం డి సాజిద్ , సిల్వర్ మెడల్స్ సాధించారని తెలివారు. అనంతరం ఊటుకూరుకు చెందిన బ్రిలియంట్ టైక్వాండో అకాడమీ డైరెక్టర్ కే.సురేంద్ర రెడ్డి గోల్డ్ మెడల్, ఆర్ గురు చరణ్ , సి శ్రీను, కే ఎల్ వి లాహిత్య, జీ. తనుజ, సి. పర్ణశ్రీ దుర్గను అభినందించారు.

మండలాభివృద్ధికి నిరంతర కృషి

ప్రజాశక్తి-కలసపాడు

మండల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని వైసిపి మండల సమన్వయ కమిటీ ఇన్‌ఛార్జి అంకన గురువిరెడ్డి, రాజుపాలెం సర్పంచ్ సుధా రామకృష్ణారెడ్డి, ఎంపిపి బోధన బోయిన నారాయణ తెలిపారు. మంగళవారం మండల కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడూ పరిష్కరిస్తున్నామని చెప్పారు. ఖరీఫ్ సీజన్‌లో తెలుగుగంగకు నీరు రాకపోవడంతో రైతులందరూ ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకొని శ్రీశైలం నుండి బ్రహ్మం సాగర్‌కు నీటిని వదిలి తద్వారా తెలుగు గంగ ఎడమ కాలవకు నీటిని వదలాలని వారు కోరారు.

సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్, ఎంపిపి

ఆదాయ వనరులను గుర్తించాలి

ప్రజాశక్తి - చాపాడు

గ్రామ పంచాయతీల అభివృద్ధికి వనరులను గుర్తించాలని ఇఒపిఆర్‌డి రాధాకృష్ణవేణి సూచించారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం సర్పంచులు, క్లాప్ మిత్రలకు శిక్షణనిచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో ఎస్‌డబ్ల్యుపిసి నిర్వహణ ద్వారా వర్మీ కంపోస్ట్ తయారుచేసి రైతులకు అమ్మకం చేసే అవకాశం ఉందన్నారు. పొడితడి చెత్తలను వేరు చేయాల్సి ఉంటుందన్నారు. కొన్ని పంచాయతీల్లో ఇతర ఆదాయ వనరులు ఏర్పాటు చేసుకుని పంచాయతీ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ట్రైనర్లు ధనేశ్వర్ బాబు, సుధాకర్, శ్రీనివాసులు పలు అంశాల పట్ల అవగాహన కల్పించారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు

ప్రజాశక్తి - సింహాద్రిపురం

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ తులసి నాగ ప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. రాజుపాలెం నుంచి బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐ అనిల్‌కుమార్ పులివెందులకు బదిలీ అయ్యారు.

ఎస్ఐ తులసి నాగ ప్రసాద్

రెవెన్యూ సదస్సులు వాయిదా

ప్రజాశక్తి - చాపాడు

ఈ నెల 16 నుంచి నిర్వహించదలచిన రెవెన్యూ సదస్సులు వాయిదా పడినట్లు ఇన్‌ఛార్జి తహశీల్దార్ యామిని తెలిపారు. ముందుగా ఈ నెల16 నుంచి సెప్టెంబర్ వరకు ఆయా తేదీలను ప్రకటించామని, ఉన్నతాధికారుల నుంచి ప్రస్తుతానికి నిలుపుదల చేయాలని ఉత్తర్వులు విడుదలయ్యాయని తెలిపారు. ఎప్పుడనేది తర్వాత ప్రకటిస్తామని ఆమె తెలిపారు.

ప్రకృతి వ్యవసాయ పొలాల సందర్శన

పులివెందుల రూరల్ : మండలంలోని ఇ. కొత్తపల్లి గ్రామపంచాయతీలో ఎఒ జి.నాగలక్ష్మి మంగళవారం పంటలను పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో అరటి పంటను సందర్శించి, వాటిలో వినూత్న పద్ధతిలో పలు పంటల విధానాలు టమోటా, బంతి చూసి ఆమె హర్షం వ్యక్తం చేశారు. రైతులతో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో నరసింహారెడ్డి, భాస్కర్‌రెడ్డి, సుభాని పాల్గొన్నారు.

ఎస్ఎలకు జెఎల్ ప్రమోషన్లు ఇవ్వాలి

వేంపల్లె : జిల్లా పరిషత్ పాఠశాలల్లో పని చేస్తున్న అర్హులైన స్కూల్ అసిస్టెంట్లకు (ఎస్ఎ) తమ వాటాగా ఉన్న 40 శాతం జూనియర్ లెక్చరర్ల పోస్టులను ప్రమోషన్లతో భర్తీ చేయాలని జూనియర్ లెక్చరర్ ప్రమోషన్ పోరాట వేదిక రాష్ట్ర లీగల్ అడ్వయిజర్ పురుషోత్తమ ఆచారి ప్రభుత్వాన్ని కోరారు. ఆ మేరకు మంగళవారం విద్యాశాఖ మంత్రి లోకేష్‌కు వినతిపత్రం సమర్పించారు. ప్రస్తుతం ఉన్న జెఎల్ పోస్టుల్లో 50 శాతం నియామక ప్రక్రియ ద్వారా 10 శాతం పోస్టులు వివిధ శాఖల్లోని బోధనేతర సిబ్బందితో భర్తీ చేస్తున్నారని తెలిపారు. మిగిలిన 40 శాతం వాటాను స్కూల్ అసిస్టెంట్లతో భర్తీ చేయాలని మంత్రిని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రతినిధులు చెరుకూరి శ్రీనువాసులు, జిల్లా కన్వీనర్ రవికుమార్, రామదాసు, శ్రీనివాసులు, మంజుల, శ్రీరాములు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

బోల్తా పడిన మినీ బస్సు, (ఇన్‌సెట్) హరి (ఫైల్‌ఫొటో)

మినీ బస్సు, ఆటో ఢీ : ఫొటోగ్రాఫర్ మృతి

ప్రజాశక్తి - సింహాద్రిపురం

లింగాల మండలం పార్నపల్లె సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా.. అయిదుగురు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలిలా ఉన్నాయి.. మంగళవారం పులివెందుల నుంచి అనంతపురం వెళుతున్న మినీ బస్సు దాడితోట నుంచి పులివెందుల వైపు వస్తున్న ఆటో ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో మినీ బస్సు బోల్తా పడింది. మినీ బస్సులోని సింహాద్రిపురం మండలం కసనూరు గ్రామానికి చెందిన ఫొటోగ్రాఫర్ హరి (36) మృతి చెందాడు. బస్సులో ఉన్న మరో అయిదు మందికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిని వెంటనే పులివెందుల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. **శోకసముద్రంలో హరి కుటుంబ సభ్యులు..** మండల కేంద్రమైన సింహాద్రిపురంలో ఫొటో స్టూడియో నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్న హరి(36) రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో కుటుంబ సభ్యులు శోక సముద్రంలో మునిగిపోయారు. మృతుడికి భార్య ఉమా మహేశ్వరి, కుమారుడు తనీష్, కుమార్తె ప్రణవి ఉన్నారు.

దొంగలను పోలీసులకు అప్పగించిన ప్రజలు

ప్రజాశక్తి - ఖాజీపేట

రైతులకు సంబంధించి వ్యవసాయ మోటర్ల స్టార్టర్లు, వైర్లు చోరీలకు పాల్పడుతున్న అయిదుగురు వ్యక్తులను తుడుమలదిన్నె గ్రామస్తులు సోమవారం అర్ధరాత్రి పట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే.. మండల పరిధిలోని తుడమలదిన్నె గ్రామ పరిధిలో చాలా రోజులుగా వ్యవసాయ స్టార్టర్లు, కేబుల్ వైర్లు చోరీకి గురవుతున్నాయి. దీన్ని రైతులు పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. ఇటీవల చోరీ ఘటనలు ఎక్కువ కావడంతో రైతులు అప్రమత్తమయ్యారు. చోరీలకు పాల్పడుతున్న దొంగలను పట్టుకునేందుకు నిఘా పెట్టారు. రాత్రి సమయాల్లో రైతులు పొలాల వద్ద కాపుకాశారు. ఈ క్రమంలో సోమవారం రాత్రి చోరీ చేసేందుకు వచ్చిన అయిదుగురు దొంగలను గ్రామస్తులు వెంబడించి పట్టుకొని పోలీసులకు అప్పగించారు. చోరీ చేసిన వైర్, పరికరాలను ఖాజీపేటలోని ఓ ఇనుము వ్యాపారికి విక్ర ఇస్తుంటారని గ్రామస్తులు తేల్చారు. స్థానికంగా ఉన్న ఇనుము వ్యాపారి వీరిని ప్రోత్సహిస్తుంటారని కొందరు రైతులు ఆరోపిస్తున్నారు. వ్యవసాయ మోటర్ల చోరికి పాల్పడుతున్న వారిని కఠినంగా శిక్షించాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని తుడుమలదిన్నె సర్పంచ్ కృష్ణారెడ్డి పోలీసులను కోరారు.

16 మంది జూదరులు అరెస్టు

- మూడు బైకులు, రెండు కార్లు, 13 సెల్ ఫోన్లు స్వాధీనం

ప్రజాశక్తి - ముద్దనూరు

మంగతాయి జూదం ఆడుతున్న 16 మంది జూదరులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ మైనుద్దీన్ తెలిపారు. తాడిపత్రి ప్రధాన రహదారిలోని యామవరం గ్రామం సమీపంలో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై ఎస్‌పి ఆదేశాల మేరకు మంగళవారం కొండాపురం సిఐ మొహమ్మద్ రఫీ, ఎస్ఐ విద్యాసాగర్, సిబ్బందితో దాడులు నిర్వహించినట్లు తెలిపారు. ప్రొద్దుటూరు, ఎర్రగుంట్ల, ముద్దనూరు, వేంపల్లెకు చెందిన 16 మందిని అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. వారి వద్ద నుంచి రూ.2,25,300 నగదు, 13 సెల్‌ఫోన్లు, మూడు బైకులు, రెండు కార్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

మండల పరిధిలోని కలమల్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు సీజ్ చేశారు. చిన్నదండ్లూరు గ్రామ పరిధిలో ఉన్న పెన్నా నది నుంచి ఇసుకను తరలిస్తున్న విషయం తెలు సుకున్న పోలీసులు దాడి చేశారు. ఇల్లూరు-చిన్నదండ్లూరు గ్రామాల పరిధిలోని పెన్నా నది నుంచి ఇసుకను రాత్రివేళ అక్రమంగా తరలిస్తూ ఉండడం పరిపాటీగా మారిందని పోలీసులు తెలిపారు. కొంతమంది పార్టీ అండదండలతో ఇసుక మాఫియా చేస్తున్నారని, ఇకపై ఎవరైనా ఎక్కడైనా ఇసుక రవాణా చేసినా, చేయిం చిన వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

ఇ-పంటకు తప్పని భూముల రీసర్వే

భూముల విస్తీర్ణం తగ్గిందని రైతుల్లో ఆందోళన

ప్రజాశక్తి - సింహాద్రిపురం

సాగు చేసిన ప్రతి పంట నమోదు (ఇ-క్రాప్) చేయాలని ప్రభుత్వం వ్యవ సాయ, రెవిన్యూ శాఖల అధికారులను ఆదేశిం చింది. అయితే క్షేత్రస్థాయిలో పరిస్థితి మరోలా ఉండడంతో అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా గత ప్రభుత్వ హయాంలో భూముల రీ సర్వే చేయడంతో చాలామంది రైతులకు సంబంధించి భూమి విస్తీర్ణంలో ఒక సెంటు నుంచి ఎకరా వరకు తగ్గించి పట్టాదారు పాస్ పుస్తకాలను మంజూరు చేశారు. దీంతో భూమి విస్తీర్ణం తగ్గిపోయిన రైతులు ఆందోళన చేయడంతో రెవెన్యూ శాఖ అధికారులు మళ్లీ రీ సర్వే చేస్తామని అప్పట్లో రైతులకు హామీ ఇచ్చారు. మండల వ్యాప్తంగా హిమగుంట్ల, సింహాద్రిపురం, నిడివెలగల, జంగంరెడ్డి పల్లె, దేవతాపురం, తెలికి గ్రామాల్లో భూముల రీ సర్వే నిర్వహించి ప్రభుత్వం నూతనంగా సర్వే రాళ్లను ఏర్పాటు చేశారు. అయితే నూతనంగా సర్వే రాళ్లు నాటిన ప్పటికీ గతంలో ఉన్న భూమికి ప్రస్తుతం భూ సర్వేతో భూ విస్తీర్ణంలో వ్యత్యాసం వచ్చింది. అయితే ప్రస్తుతం ప్రభుత్వం పంటలను పంట నమోదు చేయాలని ఆదేశించింది. దీంతో కొంత మంది రైతులు పాత భూముల విస్తీర్ణం ప్రకారమే పంట నమోదు చేయాలని రైతులు కోరుతున్నారు. సాగు చేసిన ప్రతి పంటకు పంట నమోదైతేనే పంట బీమా వస్తుందని ఒకవైపు ప్రభుత్వం చెబుతోంది. క్షేత్రస్థాయిలో మాత్రం భిన్నంగా పరిస్థితులు ఉండడంతో వ్యవసాయ శాఖ అధికారులు ఇబ్బందులు పడుతున్నారు.

పంట నమోదు చేస్తున్న అధికారులు

పాత విస్తీర్ణం ప్రకారమే నమోదు చేయాలి..

గతంలో ఉన్న భూమి విస్తీర్ణం ప్రకారమే నమోదు చేయాలి. కొత్తగా జరిగిన భూముల రీ సర్వేలో చాలా తప్పులున్నాయి. మా పూర్వీకుల ఆస్తి వారసత్వంగా వచ్చిన భూమిని తక్కువ విస్తీర్ణం చూపించారు. అధికారులు స్పందించి పంట నమోదు గతంలో ఉన్న భూమి ఆధారంగానే చేయాలి.

- గోపాల్ రెడ్డి, రైతు, హిమకుంట్ల

రెవెన్యూ దృష్టికి తీసుకెళతాం..

గత ప్రభుత్వ హయాంలో భూముల రీ సర్వే కారణంగా తమ భూముల విస్తీర్ణం తగ్గిపోయినట్లు రైతులు మా దృష్టికి తెచ్చారు. ఆ రైతుల వివరాలను రెవెన్యూ శాఖకు తెలియజేస్తాం. ప్రస్తుతం సాగులో ఉన్న పంట వివరాలను నమోదు చేస్తున్నాం.

- రామాంజనేయరెడ్డి, వ్యవసాయ ఇన్‌ఛార్జి అధికారి, సింహాద్రిపురం

రాంగోపాల్‌రెడ్డి సవాల్‌కు సిద్ధం : వైసిపి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పులివెందుల హౌసింగ్‌లో అవినీతి జరిగింది.. దీనిపై చర్చకు వైసిపి నాయకుడు జగన్మోహన్ రెడ్డి సిద్ధమా అంటూ టిడిపి శాసన మండలి సభ్యుడు భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి చేసిన సవాల్‌కు వైసిపి నాయకులు స్పందించారు. తాము ఎక్కడికైనా చర్చకు సిద్ధమని మంగళవారం స్థానిక ఇన్‌ఛార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పేర్కొన్నారు. 2,400 ఇళ్లలో అవినీతి జరిగిందని చెప్పడం చాలా విడ్డూరంగా ఉందన్నారు. ప్రజలకు ఏదైనా పథకం మంజూరు చేసే నాటికి అర్హత ప్రామాణికంగా మంజూరు చేస్తారని, ఎప్పుడో 2020-21లో మంజూరైన గృహానికి 2024లో అర్హత ప్రామాణికంగా తీసుకొని వారికి షోకాజ్ ఇవ్వడం ఏంటని వారు ప్రశ్నించారు. గతంలో ఇలాంటివి జరిగిన దాఖలాల్లేవన్నారు. నిరుపేదలు, మున్సిపాలిటీ కార్మికులు, రూ.12వేల లోపు నెలసరి ఆదాయం ఉన్న చిరుద్యోగులకు గత ప్రభుత్వం వెసులుబాటు కల్పించి వారికి గృహాలు మంజూరు చేస్తే.. ఇప్పుడు వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా సాకు చూపుతూ షోకాజ్ నోటీసులు ఇవ్వడం అన్యాయన్నారు. గతంలో టిడిపి అధికారంలో ఉన్నప్పటి నుంచి మొన్నటి వరకు పులివెందులలో మంజూరైన టిడ్కో ఇళ్లపై విచారణ జరిపించమని అడుగుతున్నామన్నారు. పులివెందులలో టిడిపి ప్రభుత్వంలో ఎంత అభివృద్ధి జరిగిందో, వైఎస్ఆర్, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ఎంత అభివృద్ధి జరిగిందనే దానికి ఎక్కడికైనా వచ్చి తమ చిత్తశుద్ధి నిరూపించుకోవడానికి సిద్ధమన్నారు. సమావేశంలో మునిసిపల్ చైర్మన్ వరప్రసాద్, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ చిన్నప్ప, పట్టణ కన్వీనర్ హాల్ గంగాధర్‌రెడ్డి, వైస్ చైర్మన్ హఫీజ్, నూర్‌బాషా, మాజీ చైర్మన్ రసూల్, జెసిఎస్ ఇన్‌ఛార్జిలు పార్నపల్లి కిషోర్, చంద్రమౌళి, కౌన్సిలర్లు ఖాదర్‌బాషా, డానియల్, కో-ఆప్షన్ దాసరి చంద్రమౌళి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్, నాయకులు

కేరళ వరద బాధితులకు విరాళాల సేకరణ

విరాళాలు సేకరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

కేరళ రాష్ట్రం వయనాడ్ వరద బాధితుల సహాయార్థం సిపిఎం, సిఐటియు మున్సిపల్ కార్మికుల ఆధ్వర్యంలో రెండురోజులపాటు పట్టణంలో విరాళాలు సేకరించినట్లు మున్సిపల్ కార్మిక సంఘ గౌరవాధ్యక్షులు సత్యనారాయణ, కార్యదర్శి సాల్మన్ తెలిపారు. ప్రొద్దుటూరు ప్రజలు, వ్యాపారస్తుల వద్ద విరాళాలు రూ.45వేలు వసూలైందని పేర్కొన్నారు. ఈ మొత్తాన్ని బాధిత రాష్ట్రానికి పంపిస్తామన్నారు. కార్యక్రమంలో సిపిఎం, సిఐటియు నాయకులు విజయకుమార్, రాఘవ, బాలసుబ్బయ్య, శేఖర్, ముంతాజ్, చెన్నారెడ్డి, ప్రమీలమ్మ, అన్నపూర్ణ, రమాదేవి, నీతమ్మ, ముంతాజ్, సర్వేశ్వరి, వెంకటసుబ్బమ్మ, చెన్నారెడ్డి పాల్గొన్నారు.

జమ్మలమడుగు రూరల్ : కేరళలోని వయనాడ్ జిల్లాలో వరదల కారణంగా కొండ చరియలు విరిగిపడిన దుర్ఘటనలో 400 మందికిపైగా మృత్యువాతపడ్డారని, వందలాది మంది గాయాలతో ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారని, కొంతమంది జాడ కానరావడం లేదని, బాధిత ప్రజలకు జరిగిన నష్టం పూడ్చలేనిదని సిపిఎం కార్యదర్శి జి.ఏసుదాస్ తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం, సిఐటియు ఆధ్వర్యంలో మంగళవారం విరాళాలు సేకరించారు. జిల్లా ప్రజలంతా బాధితులకు ఉదారంగా విరాళాలిచ్చి సంఘీభావాన్ని ప్రకటించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎ.వినయ్‌కుమార్, సిఐటియు నాయకులు హాజీ, మహమ్మద్, విద్యార్థి సంఘం నాయకులు పాల్గొన్నారు.

మళ్లించిన నీటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్

ఎస్ఆర్-1 నుంచి చెరువులకు నీటి మళ్లింపు

ప్రజాశక్తి - మైదుకూరు

మైదుకూరు మున్సిపాలిటీ, చుట్టూ ఉన్న పల్లెల్లో వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్న గ్రామాలు ఎన్నో, సకాలంలో వర్షాలు పడక బోర్లలో నీళ్లు ఇంకిపోవడం భూగర్భ జలాల అడుగంటడం చాలా ఇబ్బందులు పడి పైర్లే ఎండిపోతున్న తరుణంలో రైతులందరూ కలిసి ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు ఎమ్మెల్యే స్పందించి ఇరిగేషన్ అధికారులతో సంప్రదించి ఎస్ఆర్-1 నుంచి మంగళవారం మైదుకూరు ఎర్రచెరువుకు, లింగాలదిన్నె, చింతకుంట, శెట్టివారిపల్లె, చెరువులకు నీటిని వదిలి స్వయంగా పర్యవేక్షణ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో రైతు బాగుంటే అందరూ బాగుంటారన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు దాసరి బాబు, తెలుగు రాష్ట్ర రైతు ఉపాధ్యక్షులు ధనపాల జగన్, మాజీ గ్రంథాలయ చైర్మన్ ఎపి రవీంద్ర, భూమిరెడ్డి పెంచల్, దండు వెంకటేష్, రైతు సంఘం నాయకులు, రైతులు, ఇరిగేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

'ఉపాధి'లో పారదర్శకతకు ప్రాధాన్యత

ప్రజాశక్తి - చాపాడు

జాతీయ ఉపాధి హామీ చట్టంలో పారదర్శకతకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని అదనపు పథక సంచాలకులు సి.నాగరత్నమ్మ తెలిపారు. ఉపాధి కార్యాలయ ఆవరణలో ఉపాధి హామీ చట్టం సామాజిక తనిఖీ ప్రజావేదిక సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపిడి మాట్లాడుతూ ఉపాధి హామీ ద్వారా ఖర్చుయిన ప్రతి రూపాయికి సరైన ఆధారాలు చూపాల్సి ఉంటుందన్నారు. మండల పరిధిలో 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 1388 పనులకు గాను రూ.7.13 కోట్లు ఖర్చు చేశామన్నారు. ఈ పనులకు సంబంధించి సామాజిక తనిఖీ నిర్వహించగా రూ.3.27లక్షలు అవినీతి జరిగినట్లు గుర్తించామన్నారు. రూ.1.14 లక్షలు రికవరీ చేయించామన్నారు. పెన్షన్లలో రూ.75వేలు మృతి చెందిన వారి పెన్షనర్ల వారి బంధువులకు పంపిణీ చేయగా రికవరీ చేయించామన్నారు. ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లు గ్రామ సభలకు ముందుగా దండోరా వేయించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సిబ్బంది అలసత్వంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపిపి టి లక్ష్మమయ్య మాట్లాడుతూ మండల పరిధిలో ఎక్కువగా కుందూ, కేసీ పరిధిలో సాగు భూములున్నాయని, ఉపాధి పనులు కూడా వారికి అవసరమైన విధంగా చేపట్టడం వల్ల ఉపయోగం ఉంటుందని సూచించారు. అన్నవరం, పల్లవోలు, చాపాడు, అల్లాడుపల్లె, చియ్యపాడు, సీతారామాపురం గ్రామాల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు అవినీతికి పాల్పడుతున్నారని, పనులు అర్హులైన ప్రతి ఒక్కరికీ చూపలేకపోతున్నారని టిడిపి నాయకులు ఫిర్యాదు చేశారు. వీరిపై సమగ్ర విచారణ చేపట్టి శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. మైదుకూరు డివిజన్ ఎపిడి జుబేదా, జిల్లా క్వాలిటీ కంట్రోల్ అధికారి విజయభాస్కర్, ఎంపిడిఒ శ్రీధర్ నాయుడు, ఉపాధి ఎపిఒలు జగదీశ్వరరెడ్డి, పద్మారాణి, ఇసిలు రాజ, ప్రియాంక, పిఆర్ రిటైర్డ్ ఎఇ ఈశ్వరయ్య, ఎస్ఆర్‌పి కన్నారెడ్డి, సిసిలు, తనిఖీ సభ్యులు, ఉపాధి సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లు, ప్రజలు పాల్గొన్నారు.

మహనీయులను స్ఫూర్తిగా తీసుకోవాలి

ప్రజాశక్తి - చాపాడు

దేశం కోసం, ధర్మం కోసం తమ జీవితాలను త్యాగం చేసిన మహనీయులను విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలని వివేకానంద ఫౌండేషన్ సంస్థ వ్యవస్థాపకులు పాపిజెన్ని రామకృష్ణారెడ్డి సూచించారు. మంగళవారం మండలంలోని చియ్యపాడు హైస్కూల్‌లో విద్యార్థులు-విలువలు అనే అంశంపై చైతన్య సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎంఇఒ-2 వంశీకృష్ణ మాట్లాడుతూ మారుమూల గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి విద్యార్థుల్లో మానవతా విలువలు పెంపొందించేలా కృషి చేస్తున్న వివేకానంద ఫౌండేషన్ సంస్థ బృందాన్ని అభినందించారు. అనంతరం 60 మంది విద్యార్థులకు వివేకానందుడి విజయానికి మార్గం పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేశారు. సంస్థ ప్రతినిధులు టి.వెంకట సురేష్, కె.శ్రీనాథ్, ప్రధానోపాధ్యాయులు తిరుపాలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రాజెక్టుల నిర్వహణాలోపం క్షమించరాని నేరం

ప్రజాశక్తి - వేంపల్లె

రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణాలోపం క్షమించరాని నేరమని కాంగ్రెస్ సీనియర్ నేత డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సాగునీటి ప్రాజెక్టులను ఆధునిక దేవాలయాలని పండిట్ నెహ్రూ అభివర్ణించారన్నారు. గత వైసిపి ప్రభుత్వం ప్రాజెక్టుల నిర్వహణకు నిధులు విడుదల చేయని కారణంగా పులిచింతల, గుండ్లకమ్మ ప్రాజెక్టుల గేట్లుతోపాటు అన్నమయ్య, పింఛా ప్రాజెక్టులే కొట్టుకుపోయాయని తెలిపారు. ఈనెల 10న తుంగభద్ర డ్యాం 19వ గేటు కొట్టుకుపోయినట్లు చెప్పారు. రిజర్వాయర్‌లోని నీరంతా సముద్రం పాలైందన్నారు. నిర్వహణ సరిగా లేదని నిపుణులు హెచ్చరించినా పట్టించుకోలేదని తెలిపారు. శ్రీశైలం, నాగార్జున సాగర్, ధవళేశ్వరం, సోమశిల, మైలవరం, సుంకేసుల, చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ల నిర్వహణ లోపభూయిష్టంగా ఉందన్నారు. చంద్రబాబు ప్రభుత్వమైన ప్రాజెక్టుల పట్ల ప్రత్యేకశ్రద్ధ పెట్టి నిర్వహణకు నిధులు విడుదల చేసి సిబ్బంది కొరత లేకుండా చూడాలని తులసిరెడ్డి కోరారు.

మహా సంప్రోక్షణ వార్షికోత్సవానికి సర్వం సిద్ధం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పట్టణంలోని కొత్త బస్టాండు సమీపంలోని శ్రీచక్ర సహిత శ్రీ మహాలక్ష్మి దేవస్థాన నిర్మాణం అమ్మవారి ప్రతిష్టాపన జరిగి 12ఏళ్లు అయిన సందర్భంగా మహా సంప్రోక్షణ-పంచలోహ శ్రీచక్ర ప్రతిష్ఠ మహోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. బుధ, శుక్రవారాల్లో పలు పూజా కార్యక్రమాలు ఉంటాయన్నారు. అర్చకులు శ్రీహనుమంతరావు ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు దేవస్థాన కమిటీ నిర్వాహకులు తూగుట్ల రామచంద్రారెడ్డి, దేవస్థాన కమిటీ వారు తెలిపారు. శుక్రవారం సాయంత్రం అమ్మవారి గ్రామోత్సవం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా కోలాటాలు, వివిధ మంగళ వాయిద్యాలచే అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఎస్ఐని కలిసిన వైసిపి నేతలు

వేముల : వేముల కొత్త ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన ప్రవీణ్‌కుమార్‌ను మంగళవారం మండల వైసిపి అధ్యక్షుడు నాగేళ్ల సాంబశివారెడ్డి, ఎంపిపి చల్లా గంగాదేవి వెంకట నారాయణ, సర్పంచ్‌లు, మాజీ సర్పంచ్‌లు, నాయకులు. మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఎస్ఐను సన్మానించారు. కార్యక్రమంలో గొందిపల్లి కృష్ణారెడ్డి, భాస్కర్‌రెడ్డి, రాఘవరెడ్డి, చలపతి, శ్రీరామిరెడ్డి, బస్సు సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

గండి అంజన్న సన్నిధిలో ఎస్‌పి వి.హర్షవర్ధన్‌రాజు

గండి అంజన్నను దర్శించుకున్న ఎస్‌పి

ప్రజాశక్తి - చక్రాయపేట

గండిక్షేత్రంలో వెలిసిన వీరాంజనేయస్వామిని మంగళవారం ఎస్‌పి వి.హర్షవర్ధన్ రాజు దర్శించుకున్నారు. ప్రధాన అర్చకులు కేసరి స్వామి, ఉప ప్రధాన అర్చకులు రాజా స్వాములు ఎస్‌పి కుటుంబ సభ్యుల పేరిట అర్చన చేసి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎస్‌పి పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన ఎస్ఐ జివి కృష్ణయ్యను అక్కడి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. రికార్డులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో డిఎస్‌పి మురళి నాయక్, ఆర్కే వ్యాలీ సిఐ గోవింద్ రెడ్డి పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై దృష్టి పెట్టండి

వేంపల్లె : అసాంఘిక కార్యకలాపాలపై సిబ్బంది ప్రత్యేకదృష్టి పెట్టాలని ఎస్‌పి విష్ణువర్ధన్ రాజు సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం మండలంలోని ఇడుపులపాయ ఆర్కేవ్యాలీ, వేంపల్లె పోలీసుస్టేషన్‌లను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. కేసులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. స్టేషన్ పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచాలని సూచించారు. శాంతి భద్రతలపై సిఐ సురేష్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. ట్రాఫిక్ సమస్య లేకుండా చేయాలని ఎస్‌పి సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న సమస్యలపై కూడ దృష్టి పెట్టాలన్నారు. కేసులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. సిఐ సురేష్‌రెడ్డి, పులివెందుల డిఎస్‌పి మురళి నాయక్, ఎస్ఐ రంగారావు పాల్గొన్నారు.

ప్రభుత్వ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - చాపాడు

ప్రభుత్వ సేవలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఆర్.హారిక సూచించారు. చాపాడు కస్తూర్బా బాలికల పాఠశాలను మంగళవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థుల వసతి, తరగతి గదులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఇఒ వంశీకృష్ణ, పాఠశాల ప్రత్యేక అధికారి నాగలక్ష్మమ్మ, ఉపాధ్యాయులు. విద్యార్థులు పాల్గొన్నారు.

ఖాజీపేట : మండల పరిధిలోని సుంకేసుల సమీపంలో ఉన్న కస్తూర్బా బాలికల పాఠశాలను మంగళవారం ప్రొద్దుటూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి, ఫస్ట్‌క్లాస్ మైదుకూరు ఇన్‌ఛార్జి హారిక ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మరుగుదొడ్లు, భోజనశాల, తరగతి గదులను పరిశీలించారు. ఆవరణలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పని తీరును అడిగారు. న్యాయ చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు బాలవెంకటయ్య, న్యాయవాదులు నారాయణ రెడ్డి, నాగిరెడ్డి, శ్రీనివాసులు, కోర్ట్ సిబ్బంది సుభాష్‌రెడ్డి, రమణారెడ్డి, ప్రిన్సిపల్ భార్గవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

ప్రజాశక్తి-చక్రాయపేట

మండలంలోని గండిక్షేత్రం వీరాంజనేయస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న శాశ్వత నిత్యాన్నదాన పథకానికి దాత రూ.1,01,116 విరాళం ఇచ్చారని దేవస్థాన అసిస్టెంట్ కమిషనర్ జె.వెంకటసుబ్బయ్య తెలిపారు. మంగళవారం ప్రొద్దుటూరు పట్టణం మోడంపల్లి వాస్తవ్యులు కృష్ణమోహన్‌రెడ్డి కుటుంబ సభ్యులు ఆ మేరకు చెక్కును అందజేశారన్నారు. దాతలకు ఆలయ ప్రధాన అర్చకులు కేసరి స్వామి ప్రత్యేక పూజలు చేయించి, స్వామివారి శేష వస్త్రం, తీర్థ, ప్రసాదాలు అందజేశారు.

ఆగిపోయిన పనులకు నిధులు కేటాయించండి

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లెలో ఆగి పోయిన రోడ్డు, డ్రయినేజీ పనులు చేసేందుకు నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి సిఎం చంద్రబాబును కోరారు. ఆ మేరకు ఆయన మంగళగిరిలో ముఖ్యమంత్రి చంద్రబాబును కలిశారు. నిధుల మంజూరుపై వినతిపత్రం అందజేశారు. వేంపల్లె పట్టణంలోని ప్రధాన రహదారిలో రోడ్ల విస్తరణ, డ్రయినేజీ నిర్మించేందుకు గత ప్రభుత్వం పనులను ప్రారం భించి నట్లు తెలపారు. దాదాపు రూ.30 కోట్లతో టెండర్లను ఆమోదిం చినట్లు చెప్పారు. కడప రోడ్డు నుంచి ఎన్టీఆర్ సర్కిల్ వరకు, గండి రోడ్డులో పనులు ప్రారంభించినట్లు చెప్పారు. దాదాపు రూ.10 కోట్ల మేర పనులు జరిగాయని వివరించారు. ప్రభుత్వం మారిన తర్వాత కాంట్రాక్టర్ పనులను అర్ధాంతంగా ఆపేశాడన్నారు. పనులు నిలిచిపోవడంతో ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని సిఎంకు వివరించారు.



సిఎం చంద్రబాబుకు వినతిపత్రమిస్తున్న రాంగోపాల్‌రెడ్డి

కోర్టు భవన సమస్యలు పరిష్కరించాలి

ప్రొద్దుటూరు : న్యాయస్థానాల సముదాయాన్ని కలిగి ఉంటూ ప్రజా సమస్యలు పరిష్కరిస్తున్న కోర్టు భవన సమస్యలు పరిష్కరించాలని న్యాయవాది, ప్రజాపక్షం అధ్యక్షుడు లక్ష్మిరెడ్డి కోరారు. ఆ మేరకు ఔత్సాహికులతో కలిసి మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోర్టు భవనంలో మొదటి అంతస్తు పూర్తయి అందులో జిల్లా రెండవ అదనపు జిల్లా కోర్టు (మోటరు వాహనాల ప్రమాదాల క్లయిమ్ ట్రిబ్యునల్), సీనియర్ సివిల్ జడ్జి కోర్టు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జికోర్టు, ఈ మధ్య కాలంలో రెండవ అంతస్తులో మొదటి అదనపు జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ కోర్టు విధులు నిర్వహి స్తున్నారన్నారు. కక్షిదారులకు లిఫ్ట్ సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

విద్యా సామగ్రి పంపిణీ

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల ఎంపిపిఎస్ మెయిన్ విద్యార్థులకు షాందాసని ఫౌండేషన్ హాంగ్‌కాంగ్ వారి సహకారంతో రూరల్ డెవలప్మెంట్ వుమెన్ వెల్ఫేర్ సొసైటీ ఎర్రగుంట్ల ఆర్గనైజర్లు లీలావతమ్మ, హన్నా సుశీల, జాన్ రూ.10 వేలు విలువచేసే పలకలు, నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు ఎంఇఒ శివప్రసాద్‌చే అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సుబ్బిరెడ్డి, స్వచ్ఛంద కార్యకర్త సంజీవరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

IN THE COURT OF HON'BLE IV ADDL JUNIOR CIVIL JUDGE, KADAPA

O.S.No. 535/2023

E.Viswanath, S/o Late Subramanyam, Hindu, aged about 44 years, Pvt.Employee, resident of Snehapuri Colony, Hyderabad, Telangana State. **...Plaintiff**

Vs

Makam Anand, S/o Late Gopala Krishna, Hindu, aged about 57 years, resident of D.No.42/548, N.G.O.Colony, Jaya Nagar Colony, Kadapa City and District. **...Defendant**

SUMMONS TO DEFENDANT

పై దావాలోని వాదికి M.Lakshumma Transfer endorsement viswanth కు వ్రాయించి ఉన్నందున నీవు M.Lakshummaకు చెల్లించవలసిన మొత్తం 2,50,000/- మరియు వడ్డీ 1,06,354/- కలిసి రూ.3,56,354/-ను మీ నుండి రాబట్టుకై వాది పై దావా దాఖలు చేసి ఉన్నాడు. సదరు దావాలో మీ హాజరు నిమిత్తమై వాయిదా 5/9/2024న ఉన్నది. కావున మీరు 5/9/2024న ఉ.10.30 గం॥లకు పై కోర్టులో స్వయముగా కాని లేదా వకీలు ద్వారా కాని హాజరై మీకు ఏమైన ఆక్షేపణలు ఉన్న యెడల తెలుపుకొనవలెను. లేనియడల మీ పరోక్షమున తీర్మానించబడును.

//By Order of Court//

M.SAI NIRANJAN BABU
M. SAI VAMSI KRISHNA
Advocates
KADAPA.

IN THE COURT OF HON'BLE III ADDL JUNIOR CIVIL JUDGE, KADAPA

O.S.No. 205/2024

C.Venkata Subbaiah, S/o Subbaiah, Hindu, aged about 50 years, Business, resident of D.No.17/389, BKM Street, Kadapa City and District. **...Plaintiff**

Vs

V.Bali Setty, S/o Rachaiah, Hindu, aged about 60 years, Business, resident of D.No.12/244, Potti Sreeramulu Street, Kadapa City and District. **...Defendant**

SUMMONS TO DEFENDANT

పై దావాలోని వాదికి Promissory Note రిత్యా మీరు చెల్లించవలసిన రూ.5,34,433/- మీ నుండి రాబట్టుకొనుటకై వాదిపై దావా దాఖలు చేసి ఉన్నాడు. సదరు దావాలో మీ హాజరు నిమిత్తమై వాయిదా 27/8/24న ఉన్నది. కావున మీరు 27/8/2024న ఉ॥10.30 గంటలకు పై కోర్టులో స్వయముగా గాని, లేదా వకీలు ద్వారా కాని హాజరై మీకు ఏమైన ఆక్షేపణలు ఉన్న యెడల తెలుపుకొనవలెను. లేనియెడల మీ పరోక్షమున తీర్మానించబడును.

//By Order of Court//

M.SAI NIRANJAN BABU
M. SAI VAMSI KRISHNA
Advocates
KADAPA.